క్లుప్తంగా

ఎమ్మెల్యే కైలేకు అభినందనలు



పామర్రు: నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ను వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంపిక చేయటం అభినందనీయమని పలువురు నాయకులు ఆదివారం ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దాసరి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి గా ఉంటూ పేదల సమస్యలే తమ సమస్యలుగా భావించి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే మంచి వ్యక్తి ఎమ్మెల్యే కైలే అన్నారు. ఎమ్మెల్యేను కలిసి శాలువాలు, పుష్పమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిమ్మకూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చిగురుపాటి మురళి, ఎంపీటీసీ పి.రత్నకుమారి, రత్నాబాయి పాల్గొన్నారు.

కొండలమ్మకు మొక్కుబడుల సమర్పణ



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వేలాది సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తజనంతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి క్యూలైనుల్లో భక్తులు వేచి ఉన్నారు. ముందుగా పాల పొంగళ్లను వండిన మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ సురేష్ పర్యవేక్షించారు.

పేద విద్యార్థికి మెయిల్ ఆర్థిక సాయం



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న బాపిరెడ్డి

తోట్లవల్లూరు: పేద విద్యార్థికి మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ లిమిటెడ్(మెయిల్) సంస్థ ఆర్థిక సాయం అందజేసింది. మండలంలోని కళ్లంవారిపాలెంనకు చెందిన బద్దిగం కిరణ్ కిషోర్‌రెడ్డి బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. అతనికి చదువుల నిమిత్తం మెయిల్ తరపున సంస్థ ప్రాంతీయ ప్రతినిధి, యాకమూరు గ్రామానికి చెందిన కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ దంపతులు రూ.20 వేలను ఆదివారం అందజేశారు. గతేడాది కూడా కిషోర్‌రెడ్డికి ఆర్థిక సాయం అందజేశామని బాపిరెడ్డి తెలిపారు. దాత బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ దంపతులకు కిషోర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపాడు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

- కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్
- కొరగుంటపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



కొరగుంటపాలెంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లిరూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని కొరగుంటపాలెంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడున్నరేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఇంటింటా ఆరా తీసి అమలు జరుగుతున్న విధానాన్ని తెలుసుకున్నారు.

నెరవేరనున్న సొంతింటి కల..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ.. దేశచరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి ఏటా రూ.వేల కోట్ల వ్యయంతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ పథకాలతో పార్టీలకతీతంగా ప్రతి ఇంటా సంక్షేమాల ఆనందం తాండవిస్తున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబం ఏదో ఒక పథకం ద్వారా లబ్ధిపొందుతూ ఆర్థికంగా బలపడుతున్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ప్రత్యేకించి మహిళలు ఎంతో లబ్ధి పొందుతున్నట్లు చెప్పారు. మహిళలు ఆనందంగా ఉంటేనే కుటుంబాలు ఆనందంగా గడుస్తాయనే సత్యాన్ని గ్రహించి ముఖ్యమంత్రి జగన్ అన్నింటా మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 13 వేల మంది మహిళలకు ఇళ్ల పట్టాలు జారీ చేసి ఇళ్ల నిర్మాణాలకు అనుమతులిచ్చి సొంతింటి కల నెరవేరుస్తున్నామన్నారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రామారి రాధా, సర్పంచ్ పేరే రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు అచ్యుత రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, బొర్రా శేషుబాబు, ఈడే వెంకటేశ్వరరావు, కోమటి విష్ణువర్ధన్, షేక్ అల్లా భక్షు, బేతపూడి వెంకటరమణ, సుధాబత్తుల వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్–1 పరీక్షలు



పరీక్ష కేంద్రాలను పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ పద్మావతి, అధికారులు



గుడివాడలో పర్యవేక్షిస్తున్న పోలీసులు

గుడివాడటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్రూప్–1 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజనీరింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, కేటీఆర్ మహిళా కళాశాల, ఏఎన్నార్ కళాశాల, మాంటిస్సోరీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, గౌతమ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూళ్లలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం ఆరు సెంటర్లలో 2,816 మంది అభ్యర్థులకు గాను 1,679 మంది హాజరయ్యారని, 1,137 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఆర్డీఓ పి పద్మావతి, తహసీల్దార్ ఆంజనేయులు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు ముగిసినట్లు ఆర్డీఓ పద్మావతి తెలిపారు.

డీఎస్పీ సత్యానందం ఆధ్వర్యంలో..

గుడివాడరూరల్: ఏపీపీఎస్ గ్రూప్–1 పరీక్ష నేపథ్యంలో ఆదివారం కేటీఆర్ మహిళ కళాశాల వద్ద పరీక్షలు రాసేందుకు విద్యార్థులు భారీ సంఖ్యలో వచ్చారు. గుడివాడ డీఎస్పీ సత్యానందం ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. నిర్ణీత సమయంలోపే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి, పరీక్ష కేంద్రంలోకి అనుమతిచ్చారు. డివిజన్ వ్యాప్తంగా సుమారు 7 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

867మంది హాజరు..

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో రెండు విడతలుగా ఆదివారం నిర్వహించిన గ్రూప్ – 1 పరీక్షలకు 1,440 మందికి గాను 867మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 720 మందికి 436 మంది, మధ్యాహ్నం 720 మందికి 431 మంది హాజరయ్యారని ఆర్డీఓ పద్మావతి తెలిపారు. తహసీల్దార్ రెహ్మాన్, డీటీ కనకదుర్గ, వీఆర్వో ప్రకాష్ ఉన్నారు.

శరవేగంగా అనివేటి మండప నిర్మాణం



కొల్లేటికోటలో అనివేటి మండపాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కైకలూరు: అనివేటి మండప నిర్మాణం ద్వారా పెద్దింట్లమ్మ దేవస్థానానికి రాష్ట్ర వ్యాప్త కీర్తి దక్కుతోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద మండప నిర్మాణ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దాతల విరాళం రూ.4 కోట్లతో అనివేటి మండపాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికీ దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఈ ఏడాది వచ్చే పెద్దింట్లమ్మ జాతర ఉత్సవాలకు మండపం భక్తులకు అందుబాటులోకి వస్తోందన్నారు. సమీప జిల్లాల్లో పెద్దింట్లమ్మ దేవస్థాన అనివేటి మండపం పెద్దది కావడం విశేషమన్నారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పెద్దింట్లమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కేవీ గోపాలరావు, గ్రామ పెద్దలు బలే సముద్రుడు, నాగరాజు, దేవస్థాన పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ పాలనా దక్షతకు నిదర్శనం

ముదినేపల్లిరూరల్: ప్రతిపక్షాలకు చెందిన నేతలు, కార్యకర్తలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనా దక్షతకు ఆకర్షితులై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. మండలంలోని కొరగుంటపాలెంలో మాజీ సర్పంచ్ బత్తుల వీరవెంకట చిరంజీవి ఆధ్వర్యంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు నాయుడు రవీంద్రనాథ్ ఠాగూర్, సాయిరాజు, ఆంజనేయరాజు, బత్తుల శేఖర్, నాగరాజు టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు సమక్షాన ఆదివారం చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగనన్న ప్రజారంజక పాలనకు రాష్ట్రవ్యాప్తంగా మద్దతు వెల్లువెత్తుతోందన్నారు. ఇతర పార్టీలకు చెందిన వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాల హారతులు



పామర్రు విష్ణాలయంలో హారతులు ఇస్తున్న భక్తులు

పామర్రు: స్థానిక విష్ణాలయంలో ధనుర్మాసం సందర్భంగా ఆదివారం అమ్మవారికి ముత్యాల హారతి కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత గోదాదేవి రంగనాథ స్వాములకు విశేషంగా అభిషేకాలను అనంతరం సహస్త్ర నామాలతో పూజలను చేశారు. భక్తులకు నీరాజన మంత్రపుష్పాలను ఇచ్చి అమ్మవారి తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

అంకమ్మ తల్లి ఆలయంలో..

అమ్మవారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని అంకమ్మతల్లికి 108 మంత్ర జల బిందెలతో విశేషంగా అభిషేకాలను చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు కోటి పాండురంగారావు, అధ్యక్షుడు వరదా అప్పారావు, సభ్యులు ఉమామహేశ్వరరావు, కె.చెన్నారాయుడు, ఎం.పేరయ్య, ఏ.రామారావు పాల్గొన్నారు.

గుడివాడరూరల్: ధనుర్మాసం సందర్భంగా స్థానిక జగన్నాథపురంలో వేం చేసి ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి అమ్మవార్లకు ఆదివారం ముత్యాల హారతులు ఇచ్చారు. దేవస్థానం ఈఓ నటరాజషణ్ముఖం ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లకు ముత్యాల హారతులు ఇచ్చి భక్తులు స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ చలసాని ఇందిరారమణారావు, వేదపండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలకు విశేష స్పందన



పామర్రు: స్థానిక శివాలయం వద్ద ఉన్న లలిత కళాతోరణం వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. గుంటూరుకు చెందిన జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ వారి సౌజన్యంతో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో సుగరు, బీపీలకు సంబంధించిన పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో తమ సంస్థ ద్వారా మరిన్నిసేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. శిబిరంలో పలు గ్రామాల నుంచి 100 మందికి పైగా రోగులు వచ్చిని ఉచిత వైద్య సేవలను పొందారన్నారు. కార్యక్రమంలో గుంటూరు గ్రీన్ సిటీ సంఘ అధ్యక్షుడు ఊద దినేష్‌కుమార్, మాజీ అధ్యక్షుడు భువన, కార్యదర్శి వి.శివకృష్ణ, ప్రాజెక్టు చైర్మన్ ఎస్.సూరిబాబు, సభ్యులు కొల్లా కొండబాబు, జి.సత్యనారాయణ, డి.శ్రీనివాస్, రాము తదితరులు పాల్గొన్నారు.

132 మందికి వైద్య పరీక్షలు..

గుడ్లవల్లేరు: బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 132 మంది రోగులు పాల్గొని సుగర్, బీపీ, ఎముకలు, కీళ్లు, నడుము, కామెర్లు, జ్వరాలు, దగ్గు, ఆయాసం, ఆస్తమా, గుండె జబ్బులు సాధారణ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గుండె శస్త్రచికిత్సలకు ఆరోగ్య శ్రీ కార్డుపై చికిత్సను అందిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

లయన్స్‌లో వైద్యశిబిరం..

లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరులో ఉచిత మధుమేహ వైద్య పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. 180 మందికి డాక్టర్ రజినీ వైద్య పరీక్షలు చేశారు. అనంతరం రోగులకు ఉచితంగా మందుల అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు ఆదినారాయణ, వై.పి.సి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక 12వ వార్డులో క్యాన్సర్ వ్యాధితో మృతి చెందిన కనకమహాలక్ష్మి పార్థివ దేహాన్ని స్థానిక గ్రామ సర్పంచ్ కేతావతు కస్తూరితో కలిసి ఎమ్మెల్యే ఆదివారం నివాళులర్పించారు. మృతురాలికి సంబంధించిన అన్ని క్లెయిమ్‌లు సకాలంలో వచ్చే విధంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

పమిడిముక్కల: మండలంలోని అలీనఖీపాలెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మీర్జా సైదాన్ ఇటీవల మృతి చెందారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, జెడ్పీటీసీ యేనుగ వెంకట రమణకుమారి, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ ఆదివారం అలీనఖీపాలెం వెళ్లి సైదాన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ కార్యవర్గం ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలకవర్గం

గుడివాడటౌన్: గుడివాడ వాసవీక్లబ్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో జరిగింది. పాలకవర్గం అధ్యక్షుడిగా తిరివీధి వెంకట సుబ్బారావు, కార్యదర్శి చక్కా రామ్‌సుధీర్, కోశాధికారిగా ఎక్కలి మణిదీప్, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు తిరివీధి వేణుగోపాల్ మాట్లాడుతూ.. వాసవీక్లబ్ గుడివాడకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. సేవా కార్యక్రమాలు, సామాజిక అభివృద్ధిలో విశేష పాత్ర పోషిస్తూ జిల్లాలో ఉత్తమ క్లబ్‌గా నిలిచిన చరిత్ర ఉందన్నారు. నూతన పాలకవర్గం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి గుడివాడ ఖ్యాతిని పెంపొందించాలని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ తాతా రజినీ కుమారి, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పెరిగిన చలి తీవ్రత

గుడివాడరూరల్: గుడివాడ, పరిసర ప్రాంతాల్లో చలి తీవ్రత పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం తెల్లవారు జాము నుండి మంచు విపరీతంగా పెరగడం, చలి భారీగా పెరగడంతో ప్రజలు ఉదయం 9 గంటల వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. వాకింగ్ వెళ్లేవారు కాస్తంత ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రకృతి ప్రియులు మాత్రం పొగమంచు అందాలను ఆస్వాదిస్తూ వాకింగ్ చేశారు. మరోవైపు వైద్యులు ఆస్తమా ఉన్నవారు, 60 సంవత్సరాలు దాటిన వారు తెల్లవారు జామున ఈ మంచులో బయటకు రావడం ఆరోగ్యానికి మంచిది కాదని, ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అదే విధంగా పోలీస్‌శాఖ తెల్లవారు జామున వాహనాలు నడిపేవారు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కువ శాతం వాహనాల ప్రమాదాలు తెల్లవారు జామునే పొగమంచు వల్ల జరుగుతున్నాయని, మంచు ఎక్కువగా ఉంటే ప్రయాణాలు నిలిపివేయడం మంచిదని సూచిస్తున్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న నాయకులు

గుడివాడరూరల్: తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వృద్ధులకు అన్నదానం, వస్త్రదానం చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంవీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. పెద్ది జయమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు రమణ నిరుపేదలైన 50 మంది వృద్ధులకు అన్నదానం, వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో కాపు సంఘ నాయకుడు గోకరకొండ బలరామ్, వైఎస్సార్ సీపీ నాయకుడు పెద్ది కిషోర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరకే ధాన్యం కొనుగోళ్లు

గుడ్లవల్లేరు: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోళ్లు చేస్తోందని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ తెలిపారు. ఆదివారం వడ్లమన్నాడులో ఆమె పర్యటించారు. తొలుత రంగు మారిన ధాన్యాన్ని ఆమె పరిశీలించారు. రంగు మారిన ధాన్యానికి కూడా గిట్టుబాటు ధర వచ్చే విధంగా అధికారులకు తగు సూచనలు చేశారు. మిల్లుల యజమానులతో మాట్లాడి ధాన్యం కొనుగోళ్లపై ఆరా తీశారు. వ్యవసాయ కమిటీ జిల్లా కమిటీ సభ్యుడు పెన్నేరు ప్రభాకర్, రెవన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

13 మంది జూదరుల అరెస్ట్

కైకలూరు: గ్రామాల్లో పేకాట, కోడిపందేలు నిర్వహించే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని కైకలూరు పట్టణ సీఐ ఎంవీఎస్ నాగరాజు ఆదివారం కోరారు. సమాచారం ఇచ్చిన వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మండలంలోని శ్యామలాంబపురం గ్రామంలో పేకాట ఆడుతున్న 13 మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.27,280 నగదును స్వాధీన పర్చుకున్నామన్నారు. పండగల సందర్భంగా ఎవరైనా కోడిపందేలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రేపటి నుంచి చెడుగుడు పోటీలు

కైకలూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా యువత కోడిపందేలు, గుండాట, పేకాట వంటి జూదాలు ఆడకుండా కైకలూరు తాలూకా సెంటర్‌లో ఈ నెల 10, 11, 12 తేదీల్లో నియోజకవర్గ స్థాయి చెడుగుడు పోటీలు నిర్వహిస్తున్నామని కైకలూరు టౌన్ సీఐ ఎంవీఎస్.నాగరాజు ఆదివారం చెప్పారు. నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ పోటీల్లో వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ10 వేలు, రూ.8 వేలు నగదు బహుమతులను అందిస్తామన్నారు. జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాలతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు 94407 96434, 98484 80155 సెల్ నంబర్లలో సంప్రదించాలని సీఐ చెప్పారు.

నేటితో ముగియనున్న అన్నసమారాధన

మండవల్లి: మండలంలోని లోకుమూడి అయ్యప్పస్వామి ఆలయంలో మాలాధారులకు ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. మాలాధారుల శ్రేయస్సు కోసం ప్రతి ఏటా జ్యోతి వరకు అన్నసమారాధన నిర్వహిస్తున్నారు. అక్టోబర్ నుంచి ప్రారంభిన అన్నసమారాధన సోమవారంతో ముగిస్తోందని నిర్వాహకులు చెప్పారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పెదపారుపూడి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ గోగం సురేష్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ టి.సీతామహాలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొంటారన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

నేడు వానపాములలో గడప గడపకు మన ప్రభుత్వం

వానపాముల(పెదపారుపూడి): మండలంలోని వానపాముల గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్, ఎంపీపీ గోగం సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరించడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో లక్ష తులసీ దళాల పూజ



పూజ నిర్వహిస్తున్న రుత్వికులు

ముదినేపల్లిరూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన మండలంలోని వడాలి శ్రీసుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి ఆలయంలో లక్ష తులసీ దళాల పూజ ఆదివారం వైభవంగా జరిగింది. ధనుర్మాసం సందర్భంగా ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో 20 మంది రుత్వికులు పూజను నిర్వహించారు. ఆలయ చైర్మన్ మద్రివాడ సుబ్బలక్ష్మి, కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన లక్షతులసి పూజలో ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.